క్లుప్తంగా

శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభం



అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సారవకోట: మండలంలోని బుడితి జంక్షన్‌లో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 6న శ్రీరామ నవమి పురస్కరించుకుని అదేరోజు సీతారాముల కల్యాణం చేపట్టనున్నట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు. 9 రోజులపాటు పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు



మోనింగివారివీధిలో కుళాయిలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్

ఆమదాలవలస: మున్సిపల్ కుళాయిల ద్వారా అందించే తాగునీటిని వృథా చేయవద్దని మహిళలకు కమిషనర్ పూజారి బాలాజీప్రసాద్ సూచించారు. ఆదివారం ఉదయం పట్టణంలోని మోనింగివారి వీధి, కాలేజీ వీధి, కొత్తకోటవారి వీధిలో మున్సిపల్ కుళాయిల ద్వారా అందించే తాగునీటిని పరిశీలించారు. కొంత మంది కుళాయిలకు మోటార్లు బిగించినట్లు తన దృష్టికి వచ్చిందని కమిషనర్ అన్నారు. అలాంటివి ఉంటే స్వచ్ఛందంగా తొలగించాలని, లేదంటే స్పెషల్ డ్రైవ్‌లో మోటార్లను గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

మజ్జిగ పంపిణీ



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ఆమదాలవలస: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గల శివాలయం ఎదురుగా మెట్టక్కివలస సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని సేవా సమితి కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామావధానులు ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. జిల్లా గ్రామ సేవల ఇన్‌చార్జి రవీంద్రబాబు, సమితి కార్యవర్గ సభ్యులు, ఆమదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కె.వి.రాజారావు సేవలకు గుర్తింపు



ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న కవి కె.వి.రాజారావు

ఆమదాలవలస: పట్టణానికి చెందిన కవి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రాహీత, రచయిత కె.వి.రాజారావు మాస్టారుకు ఉగాది పురస్కారం లభించింది. ఉగాది పురస్కారాన్ని శ్రీకాకుళంలో కలెక్టర్ చేతులు మీదుగా ఆదివారం అందుకున్నారు. ఆయన రాస్తున్న కవితలు, రచనలు, సామాజిక సేవలకు ఈ పురస్కారం దక్కింది. పలువురు ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, కవులు అభినందనలు తెలిపారు.

పందిరిరాట



పందిరిరాట వేస్తున్న కలాసీ సంఘం ప్రతినిధులు, తదితరులు

నరసన్నపేట: స్థానిక జట్టు కలాసీ సంఘ భవనం వద్ద వసంత నవమి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వనమాలి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, పందిరి రాట చేపట్టారు. మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వేర్వేరుగా పాల్గొన్నారు. 9 రోజులూ వివిధ పూజా కార్యక్రమాలు, రాములవారి కల్యాణం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



నరసన్నపేట: ఎస్సీ బాలికల వసతి గృహంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో విద్యార్థినులు, సిబ్బంది



కొత్తూరు: మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీలో పంచాగ శ్రవణం చేస్తున్న పురోహితుడు



ఎల్.ఎన్.పేట: ముంగెన్నపాడు కోదండ రామాలయంలో పంచాంగ శ్రవణం

వేడుకగా ఉగాది

● 'విశ్వావసు'కు ఘన స్వాగతం ● గ్రామాల్లో సందడి



జలుమూరు: శ్రీముఖలింగంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

విశ్వావసు నామ సంవత్సరానికి తెలుగు ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ.. ఉగాది పండుగను ఆదివారం సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. పల్లెల్లో రైతులు ఏరువాక ప్రారంభించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. గ్రామాల్లో పండితులు పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని స్వీకరించారు. చిన్నారులు ఆటపాటలతో అలరించారు. పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులు సందడి చేశారు. పలుచోట్ల కవి సమ్మేళనాలు నిర్వహించారు. ఉదయం నుంచీ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

– సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: నీలమణిదుర్గ ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు



నరసన్నపేట: వేంకటేశ్వరాలయంలో శ్రీరాముడి అలంకరణలో వేంకటేశ్వరస్వామి



పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొత్తూరు: భరత నాట్యం ప్రదర్శిస్తున్న మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు



ఆమదాలవలస: పాలపోలమ్మ ఆలయ ఆవరణలో విశ్వహిందూ పరిషత్ తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బొడ్డేపల్లి మురళీధర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ఆధ్యాత్మిక వేత్తలు



ఆమదాలవలస: చింతాడలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న రైతులు, గ్రామ పెద్దలు



సరుబుజ్జిలి: రొట్టవలసలో మావుడూరి పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న పండితులు



నరసన్నపేట: నర్సింగపల్లిలో పంచాంగ శ్రావణం చేస్తున్న పండితుడు మావుడూరి జగదీష్ బాబు



పాతపట్నం: షిర్డీ సాయి బాబా మందిరంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పురోహితుడు చామర్తి వెంకట జగన్నాథాచార్యులు

పొంచి ఉన్న ప్రమాదం



ఈ చిత్రం ఆమదాలవలస మండలంలోని కామిరెడ్డిపేట రహదారి పక్కనే ఉన్న ఎండిన మర్రి చెట్టు. ఈ రహదారిలో నిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. మర్రిచెట్టి పూర్తిగా ఎండిపోవటంతో గాలివీచే సమయంలో కూలిపోయే అవకాశం ఉందని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎండిన మర్రి చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస రూరల్

నిత్యావసరాలు అందజేస్తాం

మెళియాపుట్టి: ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతి నెలా 1,000 మందికి నిత్యావసరాలు అందించే కార్యక్రమం త్వరలోనే నిర్వస్తామని కార్యకర్త సలాన రాఘవరావు అన్నారు. ఆదివారం మండలంలోని వసుంధర గ్రామంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ద్వారా 10 కుటుంబాలకు జీతాలు చెల్లించి ఈ సేవలు అందించేలా చూస్తామన్నారు. 10 రోజులపాటు గ్రామాలు విడిచి తీర్థయాత్రలకు వెళ్లేవారు సమాచారమిస్తే.. వారిదగ్గర ఉండే గోవుల సంరక్షణ చూస్తామన్నారు. అనంతరం పలువురు కార్యకర్తలను సన్మానించారు. రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇంటిపన్ను చెల్లించాలి

హిరమండలం: మండల కేంద్రంలోని ప్రజలందరూ ఇంటిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఈఓపీఆర్డీ గోవిందరావు అన్నారు. ఇంటి పన్ను వసూలుపై ఆదివారం, సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ సిబ్బంది రెండు బృందాలుగా ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేయడం జరుగుతుందన్నారు. మేజర్ పంచాయతీలో 3,392 ఇళ్లకు రూ.19.25 లక్షలు లక్ష్యం కాగా.. ఇప్పటివరకు రూ.11.87 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. ఇంటి పన్ను శత శాతం వసూలు లక్ష్యంగా పంచాయతీ సిబ్బంది పని చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



చింతాడ రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న గోవిందరావు, నాయకులు

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని బూర్జ మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు అన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌ను ఆదివారం ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. పార్టీ మండల అధ్యక్షునిగా మరోసారి బాధ్యతలు అప్పగించడంతో రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులుంతా కలిసికట్టుగా పనిచేసి పార్టీని మరింత పటిష్ఠం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఆమదాలవలసలో పార్టీ జెండాను ఎగురవేయాలన్నారు. మరోసారి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యమన్నారు. బూర్జ మండల నాయకులు పోతిన రమేష్‌నాయుడు, రంది జనా, బట్నా కృష్ణారావు, బొడ్డేపల్లి నాగరాజు పాల్గొన్నారు.

పూరిళ్లలో.. గిరిజనులు



పూరింటిలో నివసిస్తున్న గిరిజన కుటుంబం



మురగడలోయ గిరిజన గ్రామం

● పక్కా ఇళ్లకు నోచుకోని గిరిజనులు
● కనీస సదుపాయాలూ కరువే..
● పట్టించుకోని పాలకులు, అధికారులు

ఎల్.ఎన్.పేట: సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి వారిది. అధికారులు, పాలకుల చుట్టూ తిరగలేక బాధను వారిలోనే దాచుకుంటున్నారు. ఎంత కష్టమైనా బతికేయడం అలవాటు చేసుకున్నారు. కొండల్లోని గ్రామాలకు ఎవరైనా వెళ్తే.. వారికి జరుగుతున్న అన్యాయాన్ని ఏకరువు పెడుతున్నారు. తమ బాధలు తీర్చేనాథుడు ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూస్తున్నారు పాతపట్నం నియోజకవర్గంలోని పలు గ్రామాల గిరిజనులు. ఎల్.ఎన్.పేట మండలంలోని మురగడలోవ, సూదిరాయిగూడ తదితర గిరిజన గ్రామాలకు చెందిన పలువురు గిరిజనులు ఏళ్ల తరబడి పూరిళ్లలోనే నివసిస్తున్నారు. పక్కా ఇళ్లు మంజూరు చేయాలని అధికారులు, పాలకులకు ఇస్తున్న అర్జీలకు మోక్షం లేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఎల్.ఎన్.పేట, హిరమండలం, మెళియాపుట్టి, కొత్తూరు, పాతపట్నం మండలాలున్నాయి. ఐదు మండలాల్లోనూ గిరిజనులు నివసిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

● ఎల్.ఎన్.పేట మండలంలో 16 గిరిజన గ్రామాలున్నాయి. వీటిలో సుమారు 3,460 మంది గిరిజనులు ఉన్నారు. మురగడలోవ, సూదిరాయిగూడ గ్రామాల్లో ఇప్పటివరకు ఒక్క కాలనీ ఇల్లు నిర్మాణం చేపట్టలేదు. మిగిలిన గ్రామాల్లోనూ అనేక మంది లబ్ధిదారులు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

● కొత్తూరు మండలంలో 26 గిరిజన గ్రామాలున్నాయి. సుమారు 6 మంది వేల జనాభా ఉన్నారు. ఎగువమల్లెలుగూడ, బొండుగూడల్లోని గిరిజనులకు కాలనీ ఇళ్లు లేకపోవడంతోపాటు కనీస సదుపాయాలకూ నోచుకోలేదు. మిగిలిన గిరిజన గ్రామాల్లోనూ అరకొరగానే కాలనీ ఇళ్లు నిర్మాణం జరిగాయి.

● హిరమండలం మండలంలో 56 గ్రామాలు, గూడలు ఉన్నాయి. వీటిలో సుమారు 3,260 మంది గిరిజన జనాభా ఉన్నారు. ఎగువబొండుగూడ, దిగువబొండుగూడ గ్రామాల్లో కనీసం ఒక్క కాలనీ ఇల్లు కూడా ఇప్పటివరకు నిర్మించలేదు. మరికొన్ని గూడల్లోనూ ఇదే పరిస్థితి.

● పాతపట్నం మండలంలో 38 గిరిజన గ్రామాలున్నాయి. సుమారు 7,500 మంది గిరిజనులు ఉన్నారు. అనేక గిరిజన గ్రామాలు, గూడల్లో సగానికి పైగా గిరిజనులు కాలనీ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ ఇప్పటికీ ఎదురుచూస్తూనే ఉన్నారు.

ఎదురు చూస్తున్నాం



కాలనీ ఇళ్లు వస్తాయని ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. కొంతమంది కాలనీ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాలనీ ఇళ్లు ఇస్తే కట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇళ్ల నిర్మాణానికి రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు పొజిషన్ ధ్రువపత్రాలు ఇవ్వాల్సి ఉంది. అధికారులు, పాలకులు స్పందించి తమ గ్రామస్తులకు కాలనీ ఇళ్లు మంజూరు చేసి, కట్టుకునేందుకు అవకాశం కల్పించాలి.

– సవర సింహాచలం, గిరిజనుడు, మురగడ లోయ, ఎల్.ఎన్.పేట మండలం

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



గిరిజన గ్రామాల్లో కాలనీ ఇళ్లు మంజూరు చేయాలని వచ్చిన దరఖాస్తులను జిల్లా అధికారులకు నివేదించడం జరిగింది. కొన్ని గ్రామాల్లో గిరిజనులకు కాలనీ ఇళ్లు మంజూరయ్యాయి. వారితో మాట్లాడి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. కొందరికి పొజిషన్ సర్టిఫికెట్లు తీసుకుని రావాలని చెప్పాం. సర్టిఫికెట్లు ఇస్తే నిర్మాణం కోసం అనుమతి ఇస్తాం. ఎవరికైనా కాలనీ ఇళ్లు కావాలంటే నేరుగా హౌసింగ్ కార్యాలయంలో దరఖాస్తు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– రమేష్, హౌసింగ్ ఏఈ, ఎల్.ఎన్.పేట

సాగునీటి కాలువ ఆక్రమణ!



కాలువ గట్టును జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ నుంచి చీడిపూడికి వెళ్లే మార్గంలో వంశధార ఎడమ కాలువకు చెందిన చిన్న నీటి కాలువ గట్టును అవలింగికి చెందిన ఓ రైతు కబ్జాకు పాల్పడ్డారు. ఈ కాలువ గట్టుకు ఆనుకుని ఆ రైతుకు చెందిన పొలం ఉంది. జేసీబీతో గట్టును తీసి పొలంలో చేర్చుకుంటున్నాడు. ఈ గట్టు తీయడం వలన సుమారు 10 సెంట్లు వరకు కలిసి వస్తుందనే ఆలోచనతో ఇలా చేస్తున్నట్లు ఆ గ్రామానికి చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆ రైతుకు వివరణ కోరగా.. కాలువ పూడికలతో నిండిపోయిందని, కాలువలోకి జేసీబీ వెళ్లేందుకే గట్టును చదును చేస్తున్నట్లు తెలిపారు. కాలువలోని పూడికలు తొలగించాలంటే సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకుని యంత్రాలు పెట్టి పనులు చేయించాలి. అలా కాకుండా గట్టును యంత్రాలతో దౌర్జన్యంగా తొలగించడంతో పలు విమర్శలకు తావిస్తోంది. దీనిపై సంబంధిత వంశధార ఏఈని ధనుంజయ్‌ను వివరణ కోరగా.. గట్టును తొలగిస్తామని ఏ ఒక్కరూ తన అనుమతి కోరలేదన్నారు. సోమవారం కాలువ గట్టును పరిశీలిస్తానన్నారు. ఈ విషయాన్ని సబ్ కలెక్టర్, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. గట్టును తొలగించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

రచ్చబండ నిర్మాణం



రచ్చబండను ప్రారంభిస్తున్న ఏడీ సురేష్, సొసైటీ ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయం వద్ద నిర్మించిన రచ్చబండను ఏడీ బి.వి.సురేష్ ఆదివారం ప్రారంభించారు. స్థానిక సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు విరాళాలు సేకరించి రచ్చబండను నిర్మించారు. విద్యుత్ శాఖ కార్యాలయానికి వచ్చే వినియోగదారుల సౌకర్యార్థం రచ్చబండను నిర్మించినట్లు సొసైటీ గౌరవ అధ్యక్షుడు పుచ్చల విశ్వేశ్వరరావు తెలిపారు. సొసైటీ ప్రతినిధులు ఉప్పాడ పూర్ణారావు, మార్పు విజయ్‌కుమార్, రోణంకి కృష్ణంనాయుడు, విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.